



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

సంపుటి : 3 | సంచిక : 296 | జూన్ 24 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాల్లో సంచలనాలు సృష్టిస్తున్న మన దునియా మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాలు, మండలాలు మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేయుటకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335


# ఉపాధి హామీలో 'మామూళ్ళ' దందా!

- కూలీల పొట్టగొడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- రూ. 100 ఇస్తేనే మస్టర్లు, కొలతలు
- డబ్బులు ఇవ్వని వారిపై వివక్ష.. వేతనాల్లో కోత!
- ఇనుగుర్తి మండలంలో వెలుగుచూసిన వసూళ్ల పర్వం
- పట్టించుకోని ఉన్నతాధికారులు.. ఆవేదనలో కూలీలు



కూలీల కష్టం.. కొందరి లాభం?
ఎప్పుడు ఆగుతాయి ఈ అక్రమాలు?

## నిజాయితీగా పని చేసేవారికే న్యాయం జరగాలి!

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా:జూన్ 23**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఇనుగుర్తి మండలంలో అక్రమార్కులకు కామధేనువులా మారింది. ప్రతి కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల పాటు వేతనంతో కూడిన పనిని కల్పించే ఈ చట్టబద్ధమైన సామాజిక భద్రతా పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కూలీల శ్రమను దోచుకుంటూ, వారి పొట్టగొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

(మిగతా 2వ పేజీలో..)

## 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ

### మమతా బెనర్జీ స్థానంలో పార్టీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించిన రెబల్ వర్గం

### మరుసటి రోజే 8 మంది కీలక నేతలపై వేటు వేసిన మమత

### టీఎంసీలో తార స్థాయికి చేరిన అంతర్గత పోరు

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తార స్థాయికి చేరింది. 1998లో

(మిగతా 2వ పేజీలో..)



## ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్ షురూ?

**మన దునియా,హైదరాబాద్:జూన్ 23**

తెలంగాణ : ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినా, ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సవరణ) అవగాహన సదస్సుల పేరుతో బీఆర్ఎస్ అగ్రనేతలు




(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది: కేటీఆర్

- రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్
- సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ
- రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు.

(మిగతా 2వ పేజీలో..)



## 'రైతు భరోసా' నిధుల జమ వేళ కొత్త ట్విస్ట్ – ఇక వారికి మాత్రమే నిధులు..!!

**మన దునియా,హైదరాబాద్:జూన్ 23**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వానాకాలం సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో ఈ నెల 30న రైతు భరోసా కింద నిధులను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.అయితే, ఈ సారి ఒకే విడతలో నిధులు విడుదల చేస్తామని చెబుతున్న ప్రభుత్వం కొత్త నిర్ణయాలతో సిద్ధం అవుతోంది. దీంతో.. నిధుల విడుదలకు మార్గదర్శకాలను ఖరారు చేసారు. తాజా నిర్ణయాలు ఇప్పుడు కొత్త చర్చకు కారణం అవుతోంది.రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెల 30వ తేదీ ముహూర్తంగా నిర్ణయించింది. దాదాపు రూ 9 వేల

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## 'రైతు భరోసా' నిధుల జమ వేళ కొత్త ట్విస్ట్ – ఇక వారికి మాత్రమే నిధులు..!!

(మొదటి పేజీ తరువాయి)

వరకు విడుదల దిశగా నిధులు సమీకరిస్తోంది. ఈసారి దశలవారీగా కాకుండా ఒకేసారి నిధులను విడుదల చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొమ్మిది రోజుల్లో అర్హులైన రైతులందరికీ పథకం నిధులు జమ చేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. కొత్త పట్టదార్ పాసు పుస్తకాలు పొందిన వారితో కలుపుకొని సుమారు 73లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు సమాచారం. గత యాసంగి సీజన్లో కేవలం రెండు ఎకరాల వరకు మాత్రమే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. పెద్ద రైతుల కంటే చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

జూన్ 30 న నిధుల విడుదల

కాగా, ఏడున్నర ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు మాత్రమే సాయం అందించే ప్రతిపాదనపై చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇకపై కేవలం పట్టాదారు పాస్‌బుక్ ఉండటమే కాకుండా, వాస్తవంగా పంట సాగు చేస్తున్న రైతులకే రైతు భరోసా అందించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పథకం అమలులో శాటిలైట్ సర్వే కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు వివరాలను శాటిలైట్ చిత్రాల ద్వారా సేకరించిన ప్రభుత్వం, గ్రామాల వారీగా పంట విస్తీర్ణాన్ని గుర్తించింది. పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన సర్వేలో కూడా మంచి ఫలితాలు రావడంతో భవిష్యత్తులో ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకే విడతలో నిధులు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం పైన రైతుల్లో హర్షం వ్యక్తం అవుతున్నా.. శాటిలైట్ సర్వే నివేదిక ఆధారంగా ఇవ్వాలనే నిర్ణయంతో... చివరగా ఎవరి ఖాతాల్లో నిధులు జమ అవుతాయనేది కీలకంగా మారుతోంది.

## ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్ షురూ?

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ సభ్యత్వ నమోదు, కేడర్ బలోపేతంపై దృష్టి సారిస్తున్నారు. కార్యకర్తలతో మమేకమవుతూ, స్థానిక సమస్యలు, రాష్ట్ర రాజకీయాలపై చర్చిస్తున్నారు. సమావేశాలపై కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ మార్గనిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందే పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేసి, ఈసారి గెలుపు ఖాయం చేసుకోవాలని బీఆర్ఎస్ చూస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



# 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీని స్థాపించి, దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా నడిపిస్తున్న అధినేత్రి మమతా బెనర్జీ స్థానంలో కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తూ రెబల్ వర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి రివర్స్ కౌంటర్‌గా మమతా బెనర్జీ 8 మంది రెబల్ ఎమ్మెల్యేలపై వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన మాజీ రైట్ హ్యాండ్, మాజీ మంత్రి ఫిర్హాద్ హకీమ్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి మమత శాశ్వతంగా బహిష్కరించారు. బహిష్కరణకు గురైన వారిలో ఫిర్హాద్ హకీమ్, జావేద్ అహ్మద్ ఖాన్, అరూప్ రాయ్ (రెబల్స్ ప్రకటించిన కొత్త ప్రెసిడెంట్), రథిన్ ఘోష్, బిప్లబ్ మిత్ర, సబీనా యాస్మిన్, స్నేహాశిష్ చక్రవర్తి, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్ ఉన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం ఉన్న టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ నేతలు తమవైపే ఉన్నారని తిరుగుబాటు వర్గం చెబుతోంది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 60 మంది సపోర్ట్ తమకే ఉందని రెబల్స్ ప్రకటించారు. ఇప్పటికే 28 మంది టీఎంసీ లోక్‌సభ ఎంపీల్లో 20 మంది ఎంపీలు గ్రూప్‌గా విడిపోయి.. 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో విలీనమైన తరుణంలో... మెజారిటీ ఎమ్మెల్యేలు తిరగబడటం మమతా బెనర్జీ పార్టీ మనుగడకే ముప్పుగా మారింది.

## ఉపాధి హామీలో 'మామూళ్ల' దందా!

(మొదటి పేజీ తరువాయి)

**అడుగడుగునా వసూళ్ల పర్వం**

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల నిర్వహణలో కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు.

పనుల వద్దకు వచ్చి మస్టర్లు వేయడానికి,

కొత్తగా పేర్లు నమోదు చేయడానికి,

చేసిన పనికి సంబంధించిన కొలతలను అంతర్జాలంలో (ఆన్‌లైన్) నమోదు చేయడానికి,చివరకు సాంకేతిక సహాయకులకు (టీఏ) 'మామూళ్లు' ఇవ్వాలంటూ కూలీలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందుకోసం వారానికి ఒక్కో కూలీ నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

**డబ్బులు ఇవ్వకపోతే వివక్ష.. వేతనాల్లో కోత!**

కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మరికొన్ని చోట్ల మేట్లు ఈ వసూళ్ల దందాను నడిపిస్తున్నారు. సాంకేతిక సహాయకులు సైతం పని ప్రదేశానికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన, కొలతలు వేయకుండా.. కార్యాలయాల్లో కూర్చొని ఇష్టారాజ్యంగా రికార్డులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**పారదర్శకత శూన్యం.. నిమ్మకు నీరెత్తిన అధికారులు**

ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందినప్పటికీ, వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారుల ఉదాసీనత వల్లే క్షేత్రస్థాయి సిబ్బంది మరింతగా రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పారదర్శకత పూర్తిగా లోపించడంతో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ఆశయానికి గండి పడుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఇనుగుర్తి మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కూలీలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అంతా అయిపోయింది... అసెంబ్లీలో స్టాలిన్‌ను అనుకరించిన ముఖ్యమంత్రి విజయ్

### గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై తీవ్ర వాగ్వాదం

### డీఎంకేపై తీవ్ర ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి విజయ్

### స్టాలిన్ మేనరిజంను అనుకరించి చూపించిన విజయ్

### ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే ఎమ్మెల్యేల వాకౌట్

### అవినీతి కేసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్న ముఖ్యమంత్రి

తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అట్టుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు.

విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇదే సమయంలో విజయ్ తన ప్రసంగంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అనుకరించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా "అంతా సెటిల్ అయిపోయింది" అనేలా స్టాలిన్ ప్రదర్శించిన మేనరిజంను విజయ్ అసెంబ్లీలో అనుకరించి చూపించారు. దీంతో అధికార పక్ష సభ్యులు చప్పట్లతో సభ హోరెత్తింది. తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడాన్ని ఈ సందర్భంగా విజయ్ సమర్థించుకున్నారు. ప్రజాధనాన్ని దోచుకునే ప్రసక్తే లేదని, మహిళల భద్రతతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
జూన్ । బుధవారం । 24 । 2026



# రోడ్డు ప్రమాదంలో డాన్స్ మాస్టర్ అనిల్ మృతి





**బాన్సువాడకు చెందిన నటరాజ్ నాట్యమండలి నిర్వాహకుడు**

**గాంధీనగర్ క్రాసింగ్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్**

**నాట్యంతో పలికిన అడుగులు ఆగిపోయాయి: బాన్సువాడ శోకసంద్రం**

**మంచి కళాతపస్విని కోల్పోయామని కళాభిమానుల ఆవేదన**

**మన దునియా,: నిజామాబాద్ జిల్లా**

నిజామాబాద్, జూన్ 23: నిజామాబాద్ నగర శివారులోని గాంధీనగర్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడకు చెందిన ప్రముఖ నృత్య కళాకారుడు, నటరాజ్ నాట్యమండలి నిర్వాహకుడు, డాన్స్ మాస్టర్ అన్నం అనిల్ (34) అక్కడికక్కడే మృతి చెందారు. అనిల్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. అనిల్ మంగళవారం ఉదయం బైక్పై బాన్సువాడ నుంచి నిజామాబాద్ వెళ్తుండగా, నిజామాబాద్ నుంచి బాన్సువాడ వైపు వస్తున్న బాన్సువాడ డిపో ఆర్టీసీ బస్సు గాంధీనగర్ క్రాసింగ్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో అనిల్ బైక్ స్పీడ్ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. తీవ్ర



గాయాలతో అనిల్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న డిపో మేనేజర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రేమ వివాహం చేసుకుందనే కోపంతో కన్నకూతురిని హత్య చేసిన తండ్రి

**ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం.. పోస్టుమార్టంతో వెలుగులోకి వచ్చిన నిజం**

**మన దునియా,మాచర్ల,జూన్ 21**

ప్రేమించిన యువకుడిని వివాహం చేసుకుందనే ఆగ్రహంతో కన్న తండ్రే తన కుమార్తెను హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా మాచర్లలో కలకలం రేపింది. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసినప్పటికీ, పోస్టుమార్టం నివేదికలో అసలు విషయం బయటపడటంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.మాచర్ల పట్టణంలోని 22వ వార్డు యాదవ బజార్‌కు చెందిన చంద్రశ్రీనుకు ఇద్దరు సంతానం. కుమార్తె చౌడేశ్వరి ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో తమ ఇంటికి సమీపంలో నివసించే జమ్మలమడక నాగరాజుతో ఆమె ప్రేమలో పడింది. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినప్పటికీ, తమ ప్రేమ వివాహాన్ని పెద్దలు అంగీకరించరని భావించిన జంట ఇంటి నుంచి వెళ్లిపోయి వివాహం చేసుకుంది.వివాహం అనంతరం కొంతకాలం చెన్నైలో ఉన్న వీరు, తర్వాత నరసరావుపేటలోని ఓ స్నేహితుడి ఇంట్లో ఆశ్రయం పొందారు. కుమార్తె కనిపించకపోవడంతో చంద్రశ్రీను మాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం రోజులైనా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో గురజాల డీఎస్పీ జోక్యం చేసుకుని యువతి ఆచూకీ కనుగొంటామని హామీ ఇవ్వడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన జరిగిన మూడు రోజుల తర్వాత పోలీసులు చౌడేశ్వరి, నాగరాజు ఆచూకీ గుర్తించి వారిని మాచర్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో చర్చలు జరిపారు. ఇద్దరూ మేజర్లు కావడంతో తాము చట్టపరంగా ఏమీ చేయలేమని పోలీసులు స్పష్టం చేశారు. అయితే, పెద్దల



సూచన మేరకు ఐదు రోజుల పాటు ఎవరింటికి వారు వెళ్లి, ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలో చౌడేశ్వరిని తన ఇంటికి తీసుకెళ్లిన చంద్రశ్రీను, మరుసటి రోజు ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని బంధువులకు తెలిపాడు. దీంతో ప్రేమ వివాహం కారణంగా మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య చేసుకుందని మొదట అందరూ భావించారు. అయితే, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించగా షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. చౌడేశ్వరి గొంతు నులిమి హత్య చేసిన అనంతరం, ఆమెను ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. దీంతో పోలీసులు తండ్రి చంద్రశ్రీనును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.కూతురు తనకు ఇష్టం లేని వ్యక్తిని వివాహం చేసుకుందనే కారణంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

# ఏబీవీపీ పాఠశాలల బంద్ విజయవంతం

**విద్యారంగ సమస్యల పరిష్కారం వరకు పోరాటం కొనసాగుతుంది**

**దార పవన్ కళ్యాణ్**

**మన దునియా,షాద్‌నగర్:జూన్ 23**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు షాద్‌నగర్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతంగా నిర్వహించినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు.విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు విశేషంగా సహకరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, విద్యాసంస్థల మౌలిక వసతుల కల్పన విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్చరిస్తూ, సమస్యల పరిష్కారం వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. పాఠశాలల బంద్‌కు సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర్ సంయుక్త కార్యదర్శి సంతోష్, విజయ్, పవన్, కోమల్, సి. పవన్ సాయి, కృపాకర్, రాహుల్, భార్గవ్, ప్రశాంత్, శివతో పాటు ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు..



# కృష్ణలంకలో బ్లేడ్ బ్యాచ్ వీరంగం

**తండ్రి, కుమారుడిపై దారుణ దాడి**

**గొంతులు కోసిన దుండగులు..**

**బాలుడి పరిస్థితి విషమం...**

**గంజాయి మత్తులో దాడి చేశారన్న స్థానికుల ఆరోపణలు**

**దర్యాప్తు చేస్తున్న కృష్ణలంక పోలీసులు**

**మన దునియా,విజయవాడ కృష్ణలంక:జూన్ 23**



విజయవాడ కృష్ణలంకలో సోమవారం రాత్రి బ్లేడ్ బ్యాచ్ వీరంగం సృష్టించింది. కరకట్టపై శిశు భవన్ సమీపంలో ఓ కుటుంబానికి చెందిన తండ్రి, కుమారుడిపై దుండగులు బ్లేడ్‌లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంకకు చెందిన భాను, ఆయన కుమారుడిపై చెక్క కుమార్ అనే వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ముఖ్యంగా బాలుడి గొంతు భాగంలో తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే కృష్ణలంకలోని శ్రీరామ్ ఆసుపత్రికి తరలించారు. అయితే గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం వారిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి (జీజీహెచ్) తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఘటనకు గంజాయి మత్తులో తిరిగే బ్లేడ్ బ్యాచ్ సభ్యులే కారణమన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. తరచూ కరకట్ట పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమాచారం అందుకున్న కృష్ణలంక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుల కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు నమోదు చేస్తున్నారు. దాడికి గల కారణాలు, నిందితుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జూన్ 30 తర్వాత వీరికి గ్యాస్ కనెక్షన్ రద్దు.. కేంద్రం కీలక ఆదేశాలు.. మీరూ ఉన్నారా..?

**మన దునియా,న్యూఢిల్లీ:జూన్ 23**

ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ నుండి పీఎన్‌జీ కనెక్షన్‌లకు మారేందుకు వినియోగదారులకు ఇచ్చిన గడువు జూన్ 30తో ముగియనుంది. మార్చిలో ఇరాన్–అమెరియా యుద్ధం వల్ల పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాల జారీ చేసింది. అదేంటంటే.. ఒక కుటుంబం ఎల్పీజీ, పిఎన్జి కనెక్షన్ రెండింటినీ కలిగి ఉండకూడదు. పైప్‌లైన్ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నచోట పీఎన్‌జీలోకి మారాలి. తమకు ఉన్న ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కనెక్షన్లను సరెండ్ చేయాలి. ఇందుకు 90 రోజుల గడువు ఇవ్వగా.. జూన్ 30తో ముగుస్తుంది. దీంతో ఆ తర్వాత ఏం జరుగుతుందనేది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. పీఎన్‌జీలోకి మారని వినియోగదారుల ఎల్పీజీ కనెక్షన్లను రద్దు చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గ్యాస్ కనెక్షన్లు కట్..!

ఒక ప్రాంతంలో పిఎన్జి మౌలిక సదుపాయాలు ఉండి,గడువు గురించి ఒక కుటుంబానికి తెలియజేసినప్పటికీ వారు మారకపోతే ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్‌ను నిలిపివేసే అవకాశముంది. ఇప్పటికే పిఎన్జి కనెక్షన్ కలిగి ఉండి ఇంకా ఎల్పిజి సిలిండర్లను ఉపయోగిస్తున్న వారు వాటిని తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక కుటుంబం రెండు కనెక్షన్లను ఉపయోగించకూడదనే నిబంధన ఉంది. ఒకవేళ ఎల్పిజి ఇంకా ఒక ప్రాంతానికి చేరుకోకపోతే అక్కడ పైపుల ద్వారా గ్యాస్ అందుబాటులోకి వచ్చే వరకు ఎల్పిజి కనెక్షన్‌ను ఉపయోగించుకోవచ్చు.దేశవ్యాప్తంగా సుమారు లక్ష కుటుంబాలు ఇప్పటికే పీఎన్‌జీకి మారాయి. మార్చి 2026 నుండి 10.02 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లకు గ్యాసిఫికేషన్ చేయబడింది. మరో 3.22 లక్షల కనెక్షన్లకు మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. దీంతో పీఎన్జీ కనెక్షన్ల మొత్తం 13.24 లక్షలకు చేరుకుంది. దాదాపు 9.94 లక్షల మంది వినియోగదారులు కొత్త కనెక్షన్ల కోసం నమోదు చేసుకున్నారు.

డెడ్ లైన్ కొద్ది రోజులే..

గడువు తేదీకి కేవలం కొన్ని రోజులే మిగిలి ఉన్నందున ప్రజలు చివరి నిమిషం వరకు వేచి ఉండవద్దని అధికారులు సూచిస్తున్నారు. ముందుగానే జాగ్రత్తల తీసుకుని ప్రభుత్వ ఆదేశాలు పాటించడం వల్ల వంటగ్యాస్ సరఫరాలో చివరి నిమిషంలో కలిగే అంతరాయాలను నివారించవచ్చు. ఇక పైపుల ద్వారా వచ్చే గ్యాస్‌కు మారే ప్రక్రియను సులభతరం చేసుకోవచ్చు. తమ ప్రాంతంలో పైపుల ద్వారా గ్యాస్ సేవ అందుబాటులో ఉన్నప్పటికీ.. ఇంకా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తుంటే జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించాలని అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే ప్రస్తుతం ఉన్న ఎల్పీజీ కనెక్షన్ రద్దయ్యే ఛాన్స్ ఉంది. ఇప్పటికైనా వినియోగదారులు అలర్ట్ అయితే మంచిదని చమురు కంపెనీలు సూచిస్తున్నాయి.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# డీ డి ఓ పి ని, సన్మానించిన న్యాయవాదులు



మన దునియా :నిజామాబాదు జిల్లా: ప్రతినిధి

నూతనంగా నిజామాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇంచార్జి గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రహీముద్దీన్ ను జిల్లా కోర్టు న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ను కోరారు ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్, పులి జైపాల్, పిల్లి శ్రీకాంత్, రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలుగా:కొర్ర సుమలత

మన దునియా,ములుగు జిల్లా:జూన్ 23



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పా రెడ్డి బిజెపి మహిళా మోర్చా ములుగు జిల్లా అధ్యక్షురాలు గా మదనపల్లి గ్రామానికి చెందిన కొర్ర సుమలతని నియమించడం జరిగింది,గత రెండు సంవత్సరాలుగా బిజెపి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ మహిళల సమస్యలపై పోరాటం చేస్తూ బిజెపి బలోపేతానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కొర్ర సుమలత మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం లో బీజేపీ ప్రభుత్వం మహిళలకి పెద్దపీట వేస్తుందని,మహిళా సాధికారత లక్ష్యం గా పనిచేస్తున్న బీజేపీ పార్టీ లో పనిచెయ్యడం చాలా సంతోషంగా ఉందన్నారు,రాబోయే రోజుల్లో ములుగు జిల్లాలో బీజేపీ అధికారంలోకి రావడానికి,మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. నాయొక్క నియామకానికి కృషి చేసిన జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు,మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య అజ్మీరా సీతారాం నాయక్,జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం,రాష్ట్ర మరియు జిల్లా నాయకులకి ధన్యవాదాలు తెలిపారు.

## ఏసీబీ దాడుల కలకలం

### నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అరెస్టు..!

మన దునియా,నిజామాబాద్:జూన్ 23




తెలంగాణ రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా వరుస ఏసీబీ దాడులు జరుగుతూ వందల కోట్ల అక్రమాస్తులు బయటపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇంట్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే నమ్మదగిన సమాచారంతో, ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారుజామునే అధికారులు రంగంలోకి దిగారు. దీంతో సూపరింటెండెంట్ మల్లారెడ్డి, ఆయన బంధువుల ఇళ్లలో ఏక కాలంలో 10 ప్రాంతాల్లో ఈ సోదాలు చేస్తున్నారు.

## న్యాయమూర్తుల నియామకంలో జోక్యం చేసుకోలేం: సుప్రీంకోర్టు

మన దునియా,న్యూఢిల్లీ:జూన్ 23



న్యాయమూర్తుల నియామకం లో జోక్యం చేసుకోలేం: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంలు తీసుకునే నిర్ణయాల్లో న్యాయపరంగా జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం సీనియారిటీ ఉన్నంత మాత్రాన జడ్జిగా పదోన్నతి పొందడం హక్కుగా మారదని తేల్చిచెప్పింది. తనకంటే జూనియర్లకు హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించడాన్ని సవాలు చేస్తూ హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సోమవారం విచారించిన ధర్మాసనం, కొలీజియం నిర్ణయాలపై విచారణ జరిపి కొత్త వివాదాలకు తాము తెరతీయదలచుకోలేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు ఇంకా పదేళ్ల సర్వీసు ఉన్నందున ఓపిక పట్టాలని, భవిష్యత్తులో అవకాశం రావొచ్చని సూచించింది.

# తెలంగాణలో 93 వేల పెన్షన్లు కట్.. వచ్చే నెల నుంచి కొత్త ఎంపిక!

మన దునియా,హైదరాబాద్:జూన్ 23



తెలంగాణ చేయూత పెన్షన్ల సర్వే ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీలో పారదర్శకత తీసుకురావడానికి సెర్ప్ సంస్థ ప్రత్యేక సర్వే చేపట్టింది. బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్ పొందుతున్న సుమారు 19 లక్షల మందిలో, ఇప్పటివరకు 16 లక్షల మందికి పైగా వివరాలను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో 93,624 మంది అనర్హులుగా గుర్తించబడ్డారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఈ ప్రక్షాళన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి, అర్హులైన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రక్రియ వల్ల అనర్హుల ఖాతాల్లోకి వెళ్తున్న ప్రజాధనం ఆదా అవుతుందని ప్రభుత్వం నమ్ముతోంది. వచ్చే నెల మొదటి వారం నుంచే కొత్త లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

### అనర్హుల గుర్తింపులో విస్తుపోయే నిజాలు

సర్వేలో వెలుగులోకి వచ్చిన వివరాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అనర్హులుగా తేలిన 93 వేల మందిలో 40,751 మంది ఇప్పటికే మరణించినట్లు తేలింది. వీరి పేరిట ఇప్పటికీ పెన్షన్లు డ్రా అవ్వడం గమనార్హం. మరో 41,689 మంది లబ్ధిదారులు తాము ఇచ్చిన చిరునామాల్లో నివసించడం లేదు, వారి ఆచూకీ ఎక్కడా లభించడం లేదు. అలాగే 11,184 మంది ఆధార్ వివరాలు సరిగ్గా లేవని, 3,475 మంది ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. నిధులు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నా, లబ్ధిదారులు లేని విచిత్రమైన పరిస్థితులు ఉండటంతో ఈ ప్రక్షాళన అవసరమైంది. గ్రామ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి లైవ్ అథెంటికేషన్ పూర్తి చేస్తున్నారు. ఈ నెలాఖరుతో సర్వే పూర్తి కానుండటంతో, అనర్హులందరినీ లబ్ధిదారుల జాబితా నుంచి పూర్తిగా తొలగిస్తారు.

### కొత్త దరఖాస్తుదారులకు శుభవార్త

అనర్హుల తొలగింపు ప్రక్రియ ముగియగానే, కొత్త దరఖాస్తుదారులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ఎంతోమంది వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చింది. జూన్ నెలాఖరుతో అనర్హుల తొలగింపు పూర్తవుతుంది, జూలై మొదటి వారం నుంచి కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియ వేగవంతం కానుంది. క్షేత్రస్థాయిలో నిజమైన పేదలకు అండగా ఉండటమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం. దరఖాస్తుదారులు తమ వివరాలను సంబంధిత అధికారులకు అందజేసి, పెన్షన్ పొందేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వం త్వరలో కొత్త లబ్ధిదారుల జాబితాను అధికారికంగా విడుదల చేయనుంది. దీని ద్వారా అర్హులైన పేదలకు సకాలంలో పెన్షన్లు అందే అవకాశం ఉంది..

# సాగుకు బ్రేక్..రైతులకు కన్నీరు.. భారీగా పడిపోయిన వర్షపాతం.. కారణాలివే!



వర్షాకాలం వచ్చిందంటే రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుంది. పొలాలు దున్ని... విత్తనాలు చల్లి పచ్చని పంటల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తారు. కానీ ఈ ఏడాది వరుణదేవుడు కన్నెర్ర చేశాడు. రుతుపవనాలు ముఖం చాటేశాయి. దేశవ్యాప్తంగా వర్షాల లేమితో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వర్షపాతం ఏకంగా 42 శాతం పడిపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ వర్షాభావ సంక్షోభం రైతులను తీవ్రంగా బాధిస్తోంది. ప్రత్యామ్నాయ స్వల్పకాలిక పంటల వైపు మళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. నైరుతి రుతుపవనాలు ఈ జూన్ నెల ప్రారంభంలో కాస్త ఆశలు రేకెత్తించినా.. ఆ తర్వాత క్రమంగా బాగా బలహీనపడ్డాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం ఏకంగా 42 శాతం మేర పడిపోయింది. ముఖ్యంగా మధ్య భారతదేశంలో వర్షాధారిత ప్రాంతాల రైతులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి, పత్తి, నూనెగింజలు, పప్పుధాన్యాల సాగు భారీగా ఆలస్యం అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. మహారాష్ట్రలో అత్యధికంగా 82 శాతం వర్షపాతం లోటు నమోదు కాగా.. జార్ఖండ్ లో 69 శాతం.. ఛత్తీస్‌గఢ్‌లో 67 శాతం లోటు ఉంది. మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోనూ సగానికి పైగా వర్షాలు తగ్గాయి. త్వరలో వర్షాలు ఊపందుకోకపోతే ఈ ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు వానలు రాకపోవడంతో కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. తక్కువ సమయంలో చేతికొచ్చే సోయాబీన్, మొక్కజొన్న లాంటి పంటలు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. మహారాష్ట్ర మరాఠ్వాడా ప్రాంతంలో కంది పంట వేసేందుకు అన్నదాతలు వానల కోసం ఆకాశం వంక చూస్తున్నారు. మరో రెండు వారాలు చూసి అప్పటికీ వానలు పడకపోతే సోయాబీన్ సాగు చేసేందుకు రెడీ అవుతున్నారు. సాధారణంగా జూన్ మూడో వారం నాటికి మహారాష్ట్రలో రుతుపవనాలు చురుగ్గా మారతాయి. కానీ ఈసారి పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఎల్ నినో ప్రభావంతో ఒకవైపు వర్షాభావ పరిస్థితులు నెలకొంటే.. కొన్ని రాష్ట్రాల్లో ఆశ్చర్యకరంగా అంచనాలకు మించి వానలు పడుతున్నాయి. రాజస్థాన్ లో 41 శాతం, ఆంధ్రప్రదేశ్ లో 3 శాతం సాధారణం కంటే అదనంగా వర్షాలు కురిశాయి. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో కాలువలు, భూగర్భ జలాల ఆధారంగా వరినాట్లు మొదలయ్యాయి. రానున్న రోజుల్లో పరిస్థితులు మారతాయని వాతావరణ శాఖ చెబుతోంది. జూన్ 23 నాటికి తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాల్లో రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ కూడా అప్రమత్తమైంది. తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న 197 జిల్లాలను గుర్తించి.. అక్కడి రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక కంటింజెన్సీ ప్లాన్ సిద్ధం చేస్తోంది.

# తెలంగాణలో పాఠశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ

మన దునియా,హైదరాబాద్:జూన్ 23

తెలంగాణలో పాఠశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ తెలంగాణలో విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. రేషనలైజేషన్ పేరుతో 23వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజన సదుపాయాలు కల్పించాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు కఠినమైన ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. బంద్ నేపథ్యంలో పోలీసులు విద్యాసంస్థల వద్ద గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. పలు ప్రైవేట్ స్కూళ్లు ఇప్పటికే సెలవులను ప్రకటించాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూన్ । బుధవారం । 24 । 2026


# ములుగు జిల్లాలో అక్రమ ఇసుక రవాణా అవినీతి జరుగుతుందన్న బిఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారాలకు ఆధారాలతో సహా వివరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్





**మన దునియా,ములుగు జిల్లా:జూన్ 23**

ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మీడియా సమావేశం నిరవించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ములుగు జిల్లాలో ఇసుక సరఫరాలో 4 కోట్ల అవినీతి చేశారన్న బిఆర్ఎస్ నాయకుల మాటలు అవాస్తవం అక్రమ రవాణా జరిగి ఉంటే ఆధారాలతో ఎందుకు ముందుకు రావడం లేదు సీతమ్మ ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజలు నష్టపోతున్నారని అవాస్తవాలు మాట్లాడం సబబు కాదన్నారు వారు చేస్తున్న తప్పుడు ఆరోపణలు వాస్తవాలకు ఆధారాలతో సహా మీడియా సాక్షిగా వివరించారూ గతంలో మీరు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ములుగు జిల్లాలో చేయలేని అభివృద్ధి మంత్రి సీతక్క గారి కృషి వల్ల ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ మీరు ప్రతిపక్షంలో ఉన్నారు జరుగుతున్న అభివృద్ధికి సహకరించండి అంతే కానీ మంత్రి సీతక్క గారి చేసే అభివృద్ధి పనులకు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల్లో చులకన కావద్దని వారికి సూచించారు ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి యూత్ నాయకులు వివిధ మండలాల అధ్యక్షులు సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు చైర్మన్లు డైరెక్టర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# హౌస్ అరెస్ట్ మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి





**మన దునియా:నిజామాబాదు జిల్లా: ప్రతినిధి:**

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బంజారాహిల్స్ పోలీస్ లు మంగళవారం ఉదయం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజవర్గం. పరిధిలో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ఆధ్వర్యంలో తడ్వాయి మండల కేంద్రంలో బీయర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న యూరియా యాప్ రద్దు ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా స్థానిక పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ ముందస్తు అరెస్ట్ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా యాప్ వాళ్ళ రైతులు పడుతున్న ఇబ్బందిని తొలగించేందుకు శాంతి యుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్తుంటే పోలీసులు హైదరాబాద్ లో అడ్డుకోవడం విడ్డురంగా ఉందన్నారు.ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసన చేస్తే కూడా ముందస్తు అరెస్ట్ లు చేయడం అన్యాయం అన్నారు. ప్రొటెస్ట్ ప్రోగ్రాం కు వెళ్తుంటే అరెస్ట్ ఏంటని ఆయన పోలీసులను ప్రశ్నించారు. రైతులకు కోసం తాను వెళ్ళాల్సిందేనని ఆయన పోలీసులతో వాగ్వివాధానికి దిగారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్ ను వెంటనే రద్దు చెయ్యాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెరాస్మా నూతన కార్యవర్గం ఎన్నిక....

**నిజామాబాద్ జిల్లామన దునియా,:**

నందిపేట్ మరియు డొంకేశ్వర్ ఉమ్మడి మండలాల తెరాస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ రోజు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికలు తాజా మాజీ అధ్యక్షులు మరియు సిద్ధార్థ హైస్కూల్, నందిపేట్ కరస్పాండెంట్ శ్రీ చుక్కబొట్ల దేవన్న అధ్యక్షతన మరియు తెరాస్మా జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీ గోజూరి అరుణ్, రాష్ట్ర తెరాస్మా జాయింట్ సెక్రటరీ శ్రీ పండ్ల రమేష్, తెరాస్మా జిల్లా జాయింట్ సెక్రటరీ గన్నారం చిరంజీవి ఆధ్వర్యంలో స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయి.ఈ సందర్భంగా తెరాస్మా నూతన అధ్యక్షులుగా భారతి విద్యానికేతన్, తల్వేద కరస్పాండెంట్ శ్రీ కళ్లెం చిన్నారెడ్డి జనరల్ సెక్రటరీగా ఫ్రొబెల్ హై స్కూల్, డొంకేశ్వర్ కరస్పాండెంట్ బద్దం రఘు కోశాధికారిగా సాయి ప్రసన్న విద్యాలయం కరస్పాండెంట్ శ్రీ మ్యాక సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యాసంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గత కార్యవర్గ సభ్యుల సేవలను సభలో ప్రత్యేకంగా అభినందించారు. గతంలో సంఘ అభివృద్ధికి వారు అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు సభ్యులు కొనియాడారు.

**మాజీ అధ్యక్షులు చుక్కబొట్ల దేవన్న సందేశం:**

"తెరాస్మా సంఘం ఎల్లప్పుడూ ప్రైవేట్ విద్యాసంస్థల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంది. గత కార్యవర్గం అందరి సహకారంతో విజయవంతంగా పని చేసింది. ఇకపై నూతన కార్యవర్గం మరింత సమర్థవంతంగా పని చేసి ప్రైవేట్ విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని నమ్ముతున్నాను. నూతన కమిటీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




**నూతన అధ్యక్షులు శ్రీ కళ్లెం చిన్నారెడ్డి సందేశం:**

"నాపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన అన్ని పాఠశాలల కరస్పాండెంట్లకు కృతజ్ఞతలు. తెరాస్మా సంఘాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రైవేట్ పాఠశాలల సమస్యలను జిల్లా సభ్యుల దృష్టికి తీసుకెళ్లడం, విద్యా ప్రమాణాల అభివృద్ధికి కృషి చేయడం మా ప్రధాన లక్ష్యం. అందరి సహకారంతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్తాం అని తెలిపారు..కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ ఖాతాలు, డిపాజిట్లపై సర్కార్ ఆరా!




**మన దునియా,హైదరాబాద్:జూన్ 23**

ప్రభుత్వ ఖాతాలు, డిపాజిట్లపై సర్కార్ ఆరా! రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) వద్ద ఎన్ని ఖాతాలున్నాయో, వాటిలో ఎంత మేరకు డిపాజిట్లు ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఆర్థిక శాఖ అన్ని శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులకు లేఖలు రాసి ఈ వివరాలను సేకరిస్తోంది. ఇటీవల ఎస్బీఐ భూమిని ప్రభుత్వం వేలం వేయడం, దానిపై బ్యాంకు అధికారులు కోర్టును ఆశ్రయించడం వంటి పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్బీఐ నుంచి ప్రభుత్వ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ శాఖలు ఎస్బీఐ ద్వారా లావాదేవీలు జరుపరాదని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో, కొత్తగా ఎస్బీఐలో డిపాజిట్లు చేయాలంటే తమ అనుమతి తీసుకోవాలని కూడా అన్ని శాఖలకు సమాచారం పంపారు

## వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాష్

**నిరుద్యోగ యువతకు ఆధునిక గ్రంథాలయ సేవలే లక్ష్యం**

**మన దునియా,వరంగల్:జూన్ 23**



వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మీసాల ప్రకాష్ నియామకమయ్యారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సేవా కార్యక్రమాల్లో ఆయన సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ పదవి ఆయనకు దక్కింది.మంత్రి కొండా సురేఖ, కొండా మురళిలకు అత్యంత ఆప్తుడిగా పేరుగాంచిన మీసాల ప్రకాష్ నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అవసరమైన స్టడీ మెటీరియల్, అత్యాధునిక డిజిటల్ వసతులు అందుబాటులోకి తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను ఆధునీకరించి, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కు, మంత్రి కొండా సురేఖ కు మీసాల ప్రకాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నాయకత్వంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మరింత అభివృద్ధి సాధించి, విద్యార్థులు, యువతకు ఉపయోగపడే కేంద్రంగా మారుతుందని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యాపార నష్టాలు భరించలేక వ్యాపారి ఆత్మహత్య

**మన దునియా,కాశీబుగ్గ, రెడ్డిపాలెం:జూన్ 23**



వ్యాపారంలో వరుస నష్టాలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెడ్డిపాలెం గ్రామంలో విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాశిబుగ్గకు చెందిన జక్కి అశోక్ (55) గత ఐదేళ్ల క్రితం రెడ్డిపాలెం గ్రామానికి వలస వచ్చి, 'విజయదుర్గ ట్రేడర్స్' పేరిట సిమెంట్, ఐరన్ వ్యాపారం నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు.గత కొంతకాలంగా వ్యాపారం ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 22న ఉదయం షాపుకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన అశోక్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు.మంగళవారం ఉదయం కుమారుడు వినయ్ షాపు వెనుక భాగంలోని గోదాం గదిలో వెతకగా, అక్కడ ఇనుప రాడ్‌కు తాడుతో ఉరివేసుకుని అశోక్ మృతి చెందినట్లు గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?




కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు



వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్ధం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్ధాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్ధాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

# మైనర్ డ్రైవింగ్‌లో గాలిలో ప్రాణాలు.. పట్టించుకోని పోలీసులు, తల్లిదండ్రులు..



**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి : మన దునియా :**

వయసేమో 16.. చేతిలో రూ.4 లక్షల ఖరీదైన స్పోర్ట్స్ బైక్. ఇంకేముంది రయ్ రయ్ అంటూ రోడ్లపై సర్కస్ ఫీట్లు. కట్ చేస్తే ఒకరి ప్రాణం గాలిలో కలిసిపోయింది. మైనర్ల వాహనాల డ్రైవింగ్?ను కంట్రోల్ చేయడంలో వారి తల్లిదండ్రులు, పోలీసులు విఫలం అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం అని నామమాత్రానికే చెప్తున్నారని, కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అవుతుందన్న ప్రచారం సాగుతోంది.

**కామారెడ్డి నియోజకవర్గంలో..**

కామారెడ్డి పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో మైనర్ డ్రైవింగ్, సర్కస్ విన్యాసాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వచ్చి రాని డ్రైవింగ్?తో రోడ్లపైకి వెళ్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విపరీతమైన శబ్దాలు కలిగిన వాహనాలతో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నారు. మందలించాల్సిన తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఇతర ముఖ్యమైన విధుల్లో పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది. ఇలాంటి క్రమంలో మైనర్ డ్రైవింగ్ కట్టడి చేయడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఫ్రీ హ్యాండ్ ఇస్తున్న తల్లిదండ్రులు**

పిల్లలపై అతి ప్రేమ, స్టేటస్ కోసం రూ.లక్షలు పోసి స్పోర్ట్స్ బైకులు కొనిస్తున్నారు కొందరు తల్లిదండ్రులు. బాగా చదివితే బైక్ కొనిస్తామని ఊరిస్తున్నారు. 18 ఏళ్లు నిండకుండా, లైసెన్స్ లేకుండా వాహనం ఇవ్వడం నేరమని తెలిసినా పట్టించుకోవడం లేదు. మోటార్ వాహన చట్టం ప్రకారం మైనర్‌కు వాహనం ఇస్తే యజమాని అంటే తల్లిదండ్రులకే రూ.25 వేలు జరిమానా, 3 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. వాహన రిజిస్ట్రేషన్ కూడా ఏడాది పాటు రద్దు అవుతుంది. అయినా భయం లేకుండా ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

**పట్టించుకోని పోలీసులు, మైనర్ల తల్లిదండ్రులు**

మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం అని పోలీసుశాఖ నామమాత్రానికే చెప్తోందన్న అపవాదు ఉంది. కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఇతర ముఖ్యమైన విధుల్లో తలమునకలై ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది. స్పెషల్ డ్రైవ్‌లు, కాలేజీల వద్ద తనిఖీలు అరకొరగానే జరుగుతున్నాయి. మందలించాల్సిన తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తుండగా, చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మైనర్ డ్రైవింగ్‌ను కట్టడి చేయడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మైనర్ డ్రైవింగ్

స్పెషల్ డ్రైవ్ చేపడతాం

రాజేష్ చంద్ర, ఎస్పీ కామారెడ్డి


మైనర్ డ్రైవింగ్ పై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. త్వరలో మైనర్ డ్రైవింగ్ కట్టడి కోసం స్పెషన్ డ్రైవ్ చేపడతాం. కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాటిని మరింతగా కొనసాగిస్తాం. మైనర్లకు వాహనాలు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు ఆలోచించాలి. పిల్లలకు ఏది, ఎంతమేరకు అవసరమో వాటిని మాత్రమే ఇవ్వాలి.

# సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (ఫ్రాఖీ) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (ఫ్రాఖీ) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి.ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.



# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# ఐపీఎల్‌లో సంచలనం: భారీ జీతం వదులుకుని సొంతగూటికి పంత్.. లక్నోకు కుల్దీప్

**సొంత జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌కు తిరిగి వచ్చిన రిషబ్ పంత్**

**లక్నో సూపర్ జెయింట్స్ నుంచి కీలకమైన ప్లేయర్ ట్రేడ్**

**రూ. 27 కోట్ల జీతాన్ని వదులుకుని రూ. 15 కోట్లకు ఒప్పందం**

**పంత్‌కు బదులుగా లక్నో జట్టులోకి వెళ్లిన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్**

**ఐపీఎల్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ట్రేడ్‌లలో ఒకటని ప్రకటన**



ఐపీఎల్ చరిత్రలోనే ఒక కీలకమైన ప్లేయర్ ట్రేడ్ జరిగింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) మాజీ కెప్టెన్ రిషబ్ పంత్, తన పాత జట్టు అయిన ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) గూటికి తిరిగి చేరాడు. ఈ బ్లాక్‌బస్టర్ ట్రేడ్ ఒప్పందంలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో జట్టులోకి బదిలీ అయ్యాడు. ఈ మార్పును ఐపీఎల్ యాజమాన్యం ధ్రువీకరించింది.రెండు సీజన్ల క్రితం రికార్డు స్థాయిలో రూ. 27 కోట్లకు లక్నో జట్టు పంత్‌ను కొనుగోలు చేసింది. కానీ ఆటగాడిగా, కెప్టెన్ గా ఆశించిన స్థాయిలో రాణించలేదు. దాంతో జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకమైంది. ఈ క్రమంలోనే ట్రేడింగ్ చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, సొంత జట్టు ఢిల్లీకి తిరిగి వచ్చేందుకు పంత్ తన జీతంలో భారీగా కోత విధించుకోవడం గమనార్హం. ఢిల్లీ క్యాపిటల్స్‌లో పంత్ ఏడాదికి రూ. 15 కోట్లు అందుకోనున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ రూ. 13.50 కోట్ల కాంట్రాక్ట్‌పై లక్నోతో చేరాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత ముఖ్యమైన ట్రేడ్‌లలో ఒకటని ఐపీఎల్ మీడియా ప్రకటనలో పేర్కొంది.2025 సీజన్‌లో లక్నో ఫ్రాంచైజీకి కెప్టెన్‌గా ఎంపికైన పంత్, రెండేళ్ల పాటు ఆ జట్టుతో నిరాశాజనకమైన ప్రదర్శన కనబరిచాడు. 2025, 2026 సీజన్లలో అతను వరుసగా 269, 312 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఓపెనర్‌గా, ఫినిషర్‌గా వివిధ బ్యాటింగ్ స్థానాల్లో ప్రయత్నించినప్పటికీ, తన రికార్డు ధరను ఏమాత్రం సమర్థించుకోలేకపోయాడు. 2026 ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన తర్వాత లక్నో కెప్టెన్సీ నుంచి కూడా తప్పుకున్నాడు.పంత్ తన ఐపీఎల్ కెరీర్‌ను 2016లో ఢిల్లీ ఫ్రాంచైజీతోనే ప్రారంభించాడు. 2024లో ఆ జట్టును వీడే వరకు కీలక ఆటగాడిగా కొనసాగాడు. ఢిల్లీ తరఫున అత్యధికంగా 111 మ్యాచ్‌లు ఆడిన రికార్డు పంత్ పేరిట ఉంది. దాదాపు దశాబ్ద కాలం పాటు జట్టుకు ముఖ్య ఆటగాడిగా ఉంటూ, 2021 నుంచి 2024 వరకు నాలుగు సీజన్ల పాటు 43 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.ఇక, కుల్దీప్ యాదవ్ విషయానికొస్తే, ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఐదు సీజన్ల పాటు విజయవంతంగా కొనసాగాడు. 2022లో జట్టులో చేరినప్పటి నుంచి 65 మ్యాచ్‌లలో 72 వికెట్లు పడగొట్టి టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి స్పిన్నర్లలో ఒకడిగా నిలిచాడు. ప్రస్తుతం ఢిల్లీలో రూ. 13.25 కోట్లు అందుకుంటున్న కుల్దీప్, లక్నోకు మారడంతో జీతంలో స్వల్ప పెరుగుదల పొందాడు.

# ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు బయల్దేరిన టీమిండియా

**టీ20 ప్రపంచకప్ తర్వాత శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో తొలి సిరీస్**

**సచిన్ రికార్డును బద్దలు కొట్టి జట్టులోకి వచ్చిన 15 ఏళ్ల వైభవ్**

**వన్డే జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్.. తిరిగి జట్టులోకి విరాట్ కోహ్లీ**

**సిరాజ్ స్థానంలో ప్రసిధ్ కృష్ణ.. జట్టులోకి హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్**

టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత క్రికెట్ జట్టు మరో సుదీర్ఘ పర్యటనకు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని యువభారత్.. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరి వెళ్లింది. ఈ పర్యటన ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. ఈ టూర్‌లో భాగంగా భారత్ రెండు టీ20లు, ఎనిమిది వన్డేలు ఆడనుంది.

ఈ పర్యటనలో భాగంగా తొలుత ఐర్లాండ్‌తో డబ్లిన్‌లో జూన్ 26, 28 తేదీల్లో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత్ ఆడుతున్న తొలి టీ20 సిరీస్ ఇదే కావడం విశేషం. 2028లో జరగనున్న లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, ఆస్ట్రేలియా-న్యూజిలాండ్‌లో జరిగే తదుపరి టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, పొట్టి ఫార్మాట్‌లో ఇది భారత జట్టుకు ఒక కొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా 15 ఏళ్ల 71 రోజుల వయసున్న యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. తద్వారా 36 ఏళ్ల క్రితం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టి, భారత పురుషుల క్రికెట్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. అతనితో పాటు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అన్‌క్యాప్డ్ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ కూడా తొలిసారిగా సీనియర్ టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు.

సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను మొదట జట్టులోకి ఎంపిక చేసినప్పటికీ, అతని స్థానంలో ప్రసిధ్ కృష్ణను తీసుకున్నారు. అలాగే, గాయం నుంచి కోలుకున్న సీమ్-బౌలింగ్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఐర్లాండ్ పర్యటన ముగిశాక, ఇదే జట్టు ఇంగ్లండ్‌తో జులై 1 నుంచి 11 వరకు ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది.



టీ20 సిరీస్ అనంతరం జులై 14 నుంచి 19 వరకు ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ వన్డే జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్‌తో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రానున్నాడు. ఐపీఎల్ 2026లో తొడ కండరాల గాయంతో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమైన కోహ్లీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ స్పష్టం చేసింది.

# టీ20 బౌలింగ్ ర్యాంకుల్లో శ్రీచరణి నంబర్ వన్.. ఏపీ గర్విస్తోందన్న మంత్రి లోకేశ్



**మహిళల టీ20 ర్యాంకులు విడుదల చేసిన ఐసీసీ**

**బౌలింగ్ విభాగంలో శ్రీచరణికి అగ్రస్థానం**

**టీ20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో టాప్ ర్యాంకు**

**మూడు మ్యాచ్‌లలోనే 10 వికెట్లు పడగొట్టిన భారత స్పిన్నర్**

**అభినందనలు తెలిపిన ఏపీ మంత్రి నారా లోకేశ్**

భారత మహిళా క్రికెటర్ శ్రీచరణిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ప్రశంసల వర్షం కురిపించారు. అంతర్జాతీయ టీ20 బౌలింగ్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్ ర్యాంకు సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతేడాది చరణిని కలిసినప్పటి సంగతులు గుర్తుచేసుకున్న లోకేశ్, ఆమె పడిన కష్టాల నుంచి ప్రపంచస్థాయికి ఎదగడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమకు ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని చెప్పడానికి చరణి విజయమే నిదర్శనమని పేర్కొన్నారు. శ్రీచరణిని చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోందని, భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లు అందుకోవాలని ఆకాంక్షించారు.ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 21 ఏళ్ల శ్రీచరణి తొలిసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న ఆమె, ఈ టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. కేవలం మూడు మ్యాచ్‌లలోనే 10 వికెట్లు పడగొట్టింది. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 19 పరుగులిచ్చి 4 వికెట్లు తీయడం ఆమె ర్యాంకు మెరుగుపడటానికి దోహదపడింది.ఈ క్రమంలో ఇంగ్లండ్‌కు చెందిన లిన్సే స్మిత్‌ను వెనక్కి నెట్టి చరణి అగ్రస్థానానికి చేరగా, మరో ఇంగ్లండ్ బౌలర్ చార్లీ డీన్ రెండో స్థానానికి ఎగబాకింది. కేవలం ఏడాది క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన చరణి, అతి తక్కువ సమయంలోనే ఈ ఘనత సాధించడం విశేషం. ఇదే ర్యాంకింగ్స్‌లో బ్యాటర్ల విభాగంలో ఆస్ట్రేలియాకు చెందిన జార్జియా వోల్, ఆల్‌రౌండర్ల జాబితాలో వెస్టిండీస్ క్రీడాకారిణి హేలీ మాథ్యూస్ తమ అగ్రస్థానాలను నిలబెట్టుకున్నారు.

# టీమిండియాలోకి మరో కొత్త కుర్రాడు.. నితీశ్ రెడ్డి స్థానంలో సూర్యాంశ్ షెడ్గే

భారత క్రికెట్ జట్టుకు గాయం రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో ముంబై యువ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేకు తొలిసారి భారత సీనియర్ జట్టులో చోటు కల్పించినట్లు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది.ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మూడో వన్డే అనంతరం నితీశ్ ఎడమ తొడ కండరాల్లో అసౌకర్యం ఉన్నట్లు వైద్య బృందానికి తెలియజేశాడు. అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో గాయం నిర్ధారణ కావడంతో అతడికి కొంతకాలం విశ్రాంతి, పునరావాసం అవసరమని బీసీసీఐ మెడికల్ టీమ్ సూచించింది. దీంతో ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో జరిగే రెండు టీ20 సిరీస్‌ల నుంచి అతడిని తప్పించారు.ఇప్పటికే గాయం కారణంగా హార్దిక్ పాండ్య అందుబాటులో లేకపోవడంతో, నితీశ్ రెడ్డి జట్టులో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తాడని భావించారు. ముఖ్యంగా బ్యాటింగ్‌తో పాటు మీడియం పేస్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్‌గా అతడు జట్టుకు బ్యాలెన్స్ తీసుకొచ్చే ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే గాయం కారణంగా అతడు టూర్‌కు దూరం కావడం సెలెక్టర్లకు నిరాశ కలిగించింది.ఇక నితీశ్ స్థానంలో ఎంపికైన 23 ఏళ్ల సూర్యాంశ్ షెడ్గే ఇటీవల శ్రీలంకలో జరిగిన ట్రై-సిరీస్‌లో ఇండియా-ఏ తరఫున ఆకట్టుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేయడంతో పాటు బంతితో కూడా రెండు వికెట్లు సాధించాడు. అలాగే 2024-25 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 251.92 స్ట్రైక్‌రేట్‌తో 131 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు.కుడిచేతి బ్యాటర్, మీడియం పేస్ బౌలర్ అయిన షెడ్గే క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా పరుగులు చేయగల ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అతడి ప్రతిభను గుర్తించిన పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 17 ఇన్నింగ్స్‌ల్లో 165 పరుగులు చేసిన షెడ్గే, 2026 సీజన్‌లో 175.55 స్ట్రైక్‌రేట్‌తో 158 పరుగులు నమోదు చేశాడు.భారత్ జట్టు ముందుగా బెల్‌ఫాస్ట్‌లో ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడనుంది. అనంతరం ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది.



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం


## ముఖ్యమంత్రి విజయ్ బర్త్‌డే: పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన త్రిష పోస్ట్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు నటి త్రిష పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన సోషల్ మీడియా పోస్ట్, గత కొన్ని గంటలుగా వారి స్నేహంపై సాగుతున్న ప్రచారానికి తెరదించింది. విజయ్‌తో కలిసి దిగిన ఒక ఫోటోను పంచుకుంటూ, తమ అనుబంధం ఎంతటిప్రత్యేకమైనదో తెలియజేసేలా ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.జూన్ 22న విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా త్రిష నుంచి ఎలాంటి శుభాకాంక్షలు రాకపోవడంతో, ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారనే వార్తలు చర్చకు దారితీశాయి. వారి స్నేహబంధం దెబ్బతిన్నదంటూ సాగిన ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, విజయ్‌తో ఉన్న ఒక చిత్రాన్ని త్రిష సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తమ బంధం ఎంతో విశిష్టమైనదనే అర్థం వచ్చేలా ఆమె ఒక భావోద్వేగపూరితమైన క్యాప్షన్‌ను దీనికి జతచేశారు.విజయ్ పుట్టినరోజు సందర్భంగా కట్ చేసిన కేక్ ఫోటోను షేర్ చేస్తూ, "అన్నింటికీ విలువనిచ్చే వ్యక్తికి.. ఎదీణ 00.00" అని క్యాప్షన్ ఇచ్చారు. తన క్యాప్షన్‌లో '00.00' అని పేర్కొనడం ద్వారా, జూన్ 22న అర్ధరాత్రి 12 గంటలకే తాను విజయ్‌కు విషెస్ చెప్పినట్లు త్రిష పరోక్షంగా తెలిపారు. సీఎం విజయ్‌కు త్రిష పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదని, సోషల్ మీడియాలో ఆయన్ను అన్‌ఫాలో చేశారని వచ్చిన కథనాలకు ఈ పోస్ట్‌తో ఆమె సమాధానమిచ్చినట్లు అయింది. విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత వచ్చిన మొదటి పుట్టినరోజు కావడంతో పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా విజయ్, త్రిష పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించారు. వారి మధ్య ఉన్న అనుబంధం కారణంగా, వీరి గురించి సోషల్ మీడియాలో ఎప్పుడూ ఆసక్తి నెలకొని ఉంటుంది. గతంలో విజయ్ పుట్టినరోజులకు ప్రత్యేక ఫోటోలతో శుభాకాంక్షలు తెలిపే త్రిష, ఈసారి కాస్త ఆలస్యంగా స్పందించడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, తాజాగా ఆమె చేసిన పోస్ట్‌తో ఈ ఊహాగానాలకు తెరపడింది.

## హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో లోటు ఉంది: సౌత్ ఇండస్ట్రీపై తమన్నా సంచలన వ్యాఖ్యలు!

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది.దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి.కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది.భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సౌత్ ఇండస్ట్రీలో కూడా తానే కాకుండా అనుష్క, నయనతార, సమంత వంటి వారు 10 నుంచి 15 ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నామంటే.. దానికి కారణం ఈ గ్లామర్, పెర్ఫార్మెన్స్ అనే రెండు విషయాలను పక్కాగా బ్యాలెన్స్ చేయడమేనని తమన్నా చెప్పుకొచ్చింది.





## మహిళా క్రికెటర్ల కోసం ఐసీసీ ప్రసవానంతర మార్గదర్శకాలు... స్పందించిన దీపికా పదుకొణె

**ఈ నిర్ణయం చారిత్రాత్మకమంటూ ప్రశంసించిన నటి దీపికా పదుకొణె**

**ప్రసవానంతరం ఆరు దశల్లో తిరిగి ఆటకు సిద్ధమయ్యేలా ప్రణాళిక**

**తల్లితనం, కెరీర్ మధ్య ఎంచుకోవాల్సిన పరిస్థితి రాకూడదన్న ఐసీసీ చైర్మన్ జై షా**

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) రూపొందించిన నూతన మార్గదర్శకాలను బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ప్రశంసించారు. ప్రసవానంతరం క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వెసులుబాటు కల్పించేలా రూపొందించిన ఈ నిబంధనలను, మహిళా క్రీడా రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా ఆమె అభివర్ణించారు. ప్రస్తుతం రెండోసారి గర్భవతిగా ఉన్న దీపిక, ఈ మార్గదర్శకాలకు సంబంధించిన వార్తను మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ ఐసీసీ నిర్ణయానికి మద్దతు తెలిపారు.ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌నకు విరామం ప్రకటించిన రోజున ఐసీసీ ఈ 'రిటర్న్ టు ప్లే పోస్ట్ ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను సోమవారం విడుదల చేసింది. గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి అత్యున్నత స్థాయి క్రికెట్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన సమగ్ర సహకారాన్ని ఈ మార్గదర్శకాలు అందిస్తాయి. ఇందులో భాగంగా ప్రసవానంతరం కోలుకునే ప్రక్రియ, వైద్య పరీక్షలు, శిక్షణతో పాటు మానసిక మద్దతు వంటి అంశాలను దశలవారీగా పర్యవేక్షించనున్నారు.ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ జై షా మాట్లాడుతూ, "తల్లితనం కోసం క్రీడాకారిణులు తమ కెరీర్‌ను త్యాగం చేయాల్సిన పరిస్థితి రాకూడదు. దేశం తరఫున ఆడటం లేదా అమ్మతనం.. ఈ రెండింటిలో ఒకదాన్నే ఎంచుకోవాలన్న అగత్యం ఉండకూడదు" అని పేర్కొన్నారు. ఈ నూతన మార్గదర్శకాల్లో భాగంగా ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్, శిక్షణలో వెసులుబాటు, మానసిక ఆరోగ్య నిపుణుల తోడ్పాటు మరియు అవసరమైన చోట్ల శిశు సంరక్షణ సౌకర్యాలను కల్పించాలని ఐసీసీ సిఫార్సు చేసింది. త్వరలోనే రెండో బిడ్డకు జన్మనివ్వనున్న దీపిక, ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com